క్లుప్తంగా

ప్లాస్టిక్ రహిత రైల్వే స్టేషన్ లక్ష్యం



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే మేనేజర్, ఏడీఈఎన్‌లు

సామర్లకోట: ప్లాస్టిక్ రహిత రైల్వే స్టేషన్ లక్ష్యంగా చర్యలు చేపట్టినట్టు సామర్లకోట స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ప్లాస్టిక్ వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరిస్తూ ఫ్లెక్సీలు, ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రయాణికులకు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసు, సీసాల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజరు రమేష్ మాట్లాడుతూ అనేక మంది ప్లాస్టిక్ కవర్లలో వేడి టీ, సాంబారు వంటి పదార్థాలను తీసుకు వెళ్తున్నారన్నారు. దీని కారణంగా కెమికల్‌తో తయారు చేసిన ప్లాస్టిక్ కవర్లు వేడికి కరిగి క్యాన్సర్ వంటి వ్యాధులు రావడానికి కారణం అవుతాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని 25వ తేదీ నుంచి పూర్తిగా ప్లాస్టిక్‌ను స్టేషన్‌లో నిషేధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రవికాంత్, ఏడీఈఎన్ శివప్రసాద్, హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మరింత జ్ఞానం



వేసవి శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న నాగరాజు

పెద్దాపురం: పుస్తక పఠనం ద్వారా విద్యార్థికి మరింత పరిజ్ఞానం అలవడుతుందని, శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం పుస్తక పఠనం, కథలు చదవడం నేర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పులిమేరులో అన్నసమారాధన



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

పెద్దాపురం: మండలంలోని పులిమేరు చదలాడ రోడ్డులోని అభయాంజనేయ ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు ప్రారంభించగా సుమారు నాలుగు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏటా నిర్వహించే అన్నదానాన్ని ఈ ఏడాది ఘనంగా నిర్వహించారు. పులిమేరు, చదలాడ, గోరింట, తిరుపతి, దివిలి, చంద్రమాంపల్లి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడకు చెందిన ఒక విలేకరి శనివారం గాయపడ్డారు. ఒక దినపత్రికలో కాకినాడలో పని చేస్తున్న పల్లంరాజు సామర్లకోట నుంచి మోటారు సైకిల్‌పై కాకినాడ వెళ్తుండగా ముత్యాలమ్మ ఆలయ సమీపంలో రోడ్డుపై ఉన్న బురద వల్ల మోటారు సైకిలు జారి పడిపోయింది. దాంతో అతడికి బలమైన గాయమైంది. స్థానికులు వెంటనే కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాకినాడ ఎమర్జెన్సీ వార్డులో పల్లంరాజు చికిత్స పొందుతున్నట్టు కాకినాడ ప్రెస్ క్లబ్ సభ్యులు తెలిపారు.

పోస్టల్ శాఖలో ఐపీపీబీ ఖాతాల ప్రారంభం

బాలాజీచెరువు: పోస్టల్ శాఖలో ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు పొందడానికి ఐపీపీబీ ఖాతాలకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు పోస్టల్ సూపరిండెంట్ ఆర్.నవీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఖాతాలకు ఆధార్‌సీడింగ్ లేకపోవడం వల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలు నగదు రావడం లేదని, ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్‌పీసీఐ లింకేజీ చేయడం ద్వారా ఖాతాలు తిరిగి పునరుద్ధరించడబడతాయన్నారు. జూన్ 5వ తేదీలోగా గ్రామ, వార్డు స్థాయిలో సచివాలయాల సిబ్బందితో డ్రైవ్ చేపడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నకిలీలతో అప్రమత్తం

- ఖరీఫ్ ప్రారంభంతో రైతులకు సూచనలిస్తున్న అధికారులు
- ఎరువులు, పురుగుమందుల కొనుగోళ్లపై అవగాహన అవసరం
- రశీదు తప్పనిసరి



పెద్దాపురం ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

పెద్దాపురం: సాగులో అధిక దిగుబడుల సాధించేందుకు రైతులు ఎరువులు, మందులను అధికంగా వినియోగిస్తున్నారు. వారి అవసరాలను సొమ్ము చేసుకునేందుకు కొందరు నకిలీ మందులు, ఎరువులు అంటగట్టే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండకపోతే మోసపోయే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. అలాగే నకిలీ ఉత్పత్తులు అంటగట్టేవారిపై తమకు సమాచారం ఇవ్వాలని అధికార యంత్రాంగం కోరుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పాటు ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతులు ముందస్తు పంటల సాగు చేపట్టారు. ఇప్పటికీ చాలా చోట్ల మొట్టలో మొక్కజొన్న, దుంప సాగు చేపట్టారు. అయితే పంటల సాగులో భాగంగా అన్నదాతలు ఎరువులు, మందులను అధికంగా వినియోగిస్తున్నారు. వారి అవసరాలను ఆసరాగా తీసుకుని కొందరు వ్యాపారులు నకిలీ ఉత్పత్తులను అంటగట్టే అవకాశం ఉందని, రైతాంగం జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఎరువులు కొనుగోలు చేసే విషయంలో ఒకటికి రెండు సార్లు ఆలోచించాలని సూచిస్తున్నారు. అధికారులు సూచించిన పురుగు మందులనే పంటలకు వేయాలని, లేదంటే నష్టపోయే అవకాశం ఉందని వారంటున్నారు.

దళారుల వద్ద కొనుగోలు చేయొద్దు

నిషేధిత పురుగుల మందులు కొనుగోలు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉంది. కొందరు ఎరువుల వ్యాపారులు దిగుబడి అధికంగా వస్తుందని నమ్మించి అనుమతి లేని వివిధ కంపెనీల కల్తీ ఎరువులు, పురుగు మందులును అంటగట్టే అవకాశం ఉంది. ప్రధానంగా అనుమతిలేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయవద్దని. తక్కువ ధరకు ఇస్తున్నారని వాటిని వినియోగిస్తే పంట దిగుబడి తగ్గడంతో పాటు భూసారం దెబ్బతింటుందని అధికారులు చెప్తున్నారు. కొనుగోళ్లు చేసేటప్పుడు మందుల లేబుళ్లను పరిశీలించి, అవి కంపెనీ ఎరువులా, లేక స్థానికంగా తయారు చేసినవా అనే విషయాలు తెలుసుకోవాలి. కొనుగోలు చేసిన ప్రతి ఎరువు, పురుగుల మందుకు రశీదును తీసుకోవాలి.

నకిలీ అని తెలిస్తే ఫిర్యాదు చెయ్యండి

గ్రామాల్లో ఎవరైనా లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువుల, పురుగు మందులు విక్రయిస్తే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలి. మందుల లాట్ నంబరును బట్టి తయారీ చేసిన తేదీని గుర్తించి ఏ కంపెనీ, ఏ రకం వంటి విషయాలను చూడాలి. దుకాణ యజమాని సంతకంతో కూడిన రశీదును తప్పక తీసుకోవాలి. ప్రధానంగా విత్తనాలకు సంబంధించిన సంచులపై సీలు తొలగించినట్లు గుర్తిస్తే వాటిని కోనుగోలు చేయకుండా నకిలీలపై ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో అది వాస్తవమని తెలిస్తే సంబంధిత డీలర్‌పై కేసు నమోదు చేసి రైతులకు న్యాయం చేయడానికి అవకాశం ఉంటుంది.

లైసెన్స్ రద్దు చేస్తాం



ఎరువుల దుకాణాల్లో నకిలీ విత్తనాలు, ఎరువుల, పురుగుల మందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే దుకాణ లైసెన్స్ రద్దు చేస్తాం. రైతులు ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు దుకాణం పేరుతో పాటు యజమాని సంతకంతో కూడిన రశీదు తప్పక తీసుకోవాలి. చదువురాని వారు తెలిసిన వారికి చూపించి అది ఏ కంపెనీనో గుర్తించిన తరువాతనే కొనుగోలు చేయాలి. డబ్బాలో సూచించిన ప్రకారమే మందును పిచికారీ చేయాలి. లేకుంటే పంట దెబ్బతినే అవకాశం ఉంది. రైతులు మందుల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి.

– కె.సంజయ్‌కుమార్, ఎంఏఓ, పెద్దాపురం

రేపు మదుగులమ్మ జాతర



హుస్సేన్‌పురంలోని మదుగులమ్మ తల్లి

సామర్లకోట: మండల పరిధిలోని హుస్సేన్‌పురంలో వేంచేసి ఉన్న మదుగులమ్మ జాతర సోమవారం జరుగుతుందని ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. వైశాఖ మాసం అమావాస్య ముందు రోజున జాతర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ నాయకుడు చల్లా బుజ్జి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి కుటుంబంలోను నైవేద్యాలు పెట్టుకుని అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు. రాత్రికి అమ్మవారి జాతర ఉంటుందని చెప్పారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్య లో అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉండటంతో సీఐ ఎ. కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే గ్రామ పెద్దలతో సీఐ సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు.

ఉద్యాన సాగులో మెళకువలు పాటించాలి

సీనియర్ శాస్త్రవేత్త సునీత



రైతు సదస్సులో వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సునీత

పెద్దాపురం: మెట్ట ప్రాంత రైతులు ఉద్యాన పంటలో మెళకువలు పాటించాలని ఉద్యాన పరిశోధనా స్థానం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త పి.సునీత అన్నారు. మండలంలోని రాయభూపాలపట్నంలో శనివారం ఉద్యాన శాఖ పార్వతీపురం బీఎస్సీ ఉద్యాన కళాశాల ఆఖరి సంవత్సరం విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం పరిశోధన స్థానం శాస్త్రవేత్త జానకి అధ్యక్షతన జరిగిన సదస్సులో సునీత మాట్లాడుతూ చీడపీడల నివారణ, నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులు దృష్టి సారించాలన్నారు. శాస్త్రవేత్త జానకి, పార్వతీపురం ఉద్యాన కళాశాల డీన్ పి.ప్రదీప్, బిందుసేద్యం పథక సంచాలకులు వివి వరప్రసాదరావు మాట్లాడుతూ సేంద్రియ సాగుపై దృష్టి సారించాలన్నారు. తద్వారా రైతులు మేలైన ఆరోగ్యకరమైన పంటలతో పాటు ఆదాయాన్ని సాధించవచ్చన్నారు. అనంతరం పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు మాదబోయిన చిలకమ్మ, సీహెచ్ దుర్గ, మల్లిక, మధు, చంద్రరావు, సత్య, కళాశాల విద్యార్థులు వినయ్‌వర్మ, రుత్విక్, అజయ్, ఫరూక్, శ్రీనివాస్, వీరమనోహర్, మాజీ ఎంపీటీసీ కల్లూరి శ్రీనివాస్, జనసేన నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురం, జయలక్ష్మీ థియేటర్ రోడ్డులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు ఇన్నకోట సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, సుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఉదయం 6.30 నిమిషాలకు శిబిరం ప్రారంభం అవుతుందని పరీక్షలకు వచ్చే వారు ఎటువంటి ఆహారం తీసుకోకుండా హాజరుకావాలని సూచించారు. వివరాలను సెల్ నెం .98664 11346కు సంప్రదించాలన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలి



కార్యక్రమంలో విద్యార్థులకు చెప్పాల్సిన అంశాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తపల్లి: బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొమరగిరి పీహెచ్‌సీలో శనివారం ఆశా కార్యకర్తలకు, ఏఎన్‌ఎం, ఆరోగ్యకేంద్రం సిబ్బందికి వైద్యాధికారి ఆధ్వర్యంలో పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు శిక్షణ ఇచ్చారు. 18 ఏళ్లలోపు పిల్లలకు గుడ్, బ్యాడ్ టచ్‌లు, లైంగిక వేధింపులు, రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి డీఏ రత్నరాజు, ఎడ్యుకేటర్ జి.రాంబాబు, సూపర్‌వైజర్లు రత్నం, హనుమంతరావు ఉన్నారు.

సరకులు సక్రమంగా పంపిణీ చేయాలి

రేషన్ డీలర్ల సమావేశంలో తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి



సామర్లకోటలో డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: వినియోగదారులకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరకులు ఇంటింటికీ వెళ్లే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో వినియోగదాలకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత డీలర్లపై ఉందన్నారు. పని వేళలలో రేషన్ షాపులు తెరచి ఉంచడంతో పాటు, తూకంలో తేడాలు లేకుండా చూడాలన్నారు. నిత్యం నోటీసు బోర్డులో స్టాక్‌ను నమోదు చేయాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు రాలేని వృద్ధులు, దివ్యాంగులు ఉంటే వారికి సరకులు ఐదో తేదీ నుంచి పదో లోపుగా అందజేసే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ మేరకు వీఆర్వోల సహకారం ఉంటుందని చెప్పారు. డీలర్లపై ఫిర్యాదులు వస్తే వెంటనే తొలగిస్తామని హెచ్చరించారు. డీలర్లకు నాసిరకమైన సరకులు వస్తే వెంటనే ఎంఎస్‌ఓ దృష్టికి తీసుకు రావాలన్నారు. రేషన్ స్టాక్‌లో ఏ మాత్రం తేడాలు ఉన్నా చర్యలు తీవ్రంగా ఉంటాయని తెలిపారు. గతంలో పని చేసిన డీలర్లే ఇప్పటికీ ఉండటం వలన అనుభవంతో మరింత బాధ్యతగా పని చేయాలన్నారు. ప్రతి రేషన్ షాపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండల పరిధిలో గతంలో ఉన్న 75 రేషన్ షాపుల ద్వారా సరకుల పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. మండలంలో అదనంగా మరో 12 షాపులను ఎంపిక చేసినట్టు తెలిపారు.

అసంపూర్తి పనులతో అవస్థలు



సామర్లకోట మఠంసెంటర్ డ్రైనుపై అసంపూర్తిగా వేసిన శ్లాబులు

సామర్లకోట: స్థానిక మఠంసెంటర్‌లో అంబటి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఎట్టకేలకు నాలుగు నెలల తరువాత డ్రైన్‌పై శ్లాబులు వేశారు. అయితే వాటిని అసంపూర్తిగా వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పట్టణంలో పూడిక తీత పనుల్లో భాగంగా నాలుగు నెలల క్రితం షాపింగ్ కాంప్లెక్స్ వద్ద కల్వర్టును కాంట్రాక్టరు కూల్చి వేశాడు. కల్వర్టు నిర్మాణానికి మున్సిపల్ నిధులు కేటాయించడానికి కౌన్సిల్ నిరాకరించిన నేపథ్యంలో డ్రైన్లపై శ్లాబ్ రాళ్లు వేయడానికి నిర్ణయించి రాళ్లను తయారు చేశారు. అయితే కొలతలు తేడా రావడంతో ఎగుడుదిగుళ్లు వచ్చాయి. దాంతో అంబటి షాపింగ్ కాంప్లెక్స్‌కు వచ్చే వారు పొడవుగా ఉన్న రాయిని గమనించక పోవడంతో అనేక మంది దానిని తన్నుకొని ప్రమాదాల పాలవుతున్నారు. దాంతో షాపింగ్ కాంప్లెక్స్ యజమానులు అటు వినియోగదారులు రాకుండా పొడవుగా ఉన్న కారును ఏర్పాటు చేశారు. చేసే పని అసంపూర్తిగా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఔట్ సోర్సింగ్ కార్మికుల చలో పిఠాపురం



పాదయాత్రగా పిఠాపురానికి వెళ్తున్న కార్మికులు

సామర్లకోట: మున్సిపల్ కార్యాలయం వద్ద 18 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు శనివారం 'చలో పిఠాపురం' నిర్వహించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని ఈ నెల 7వ తేదీ నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. తమ సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. ఈ మేరకు సామర్లకోట నుంచి పాదయాత్రగా కాకినాడకు చేరుకుని అక్కడి నుంచి వివిధ మున్సిపాలిటీలకు చెందిన కార్మికులతో కలసి పాదయాత్రగా పిఠాపురం వెళ్లి డిప్యూటీ సీఎం కార్యాలయం వద్ద తమ సమస్యలపై వినతి పత్రం అందజేయనున్నట్టు పట్టణ ఔట్ సోర్సింగ్ కార్మిక సంఘ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు తెలిపారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి



ఉపాధి శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీఐటీయూ నాయకులు

కొత్తపల్లి: ఉపాధి శ్రామికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని మండల సీఐటీయూ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని నాగులపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం సీఐటీయూ నాయకులు పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు వారాల వేతన బకాయిలను వెంటనే విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. పని ప్రదేశాల్లో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, తాగునీరు, పనిముట్లను అందించాలని, ప్రమాదవశాత్తు శ్రామికులు మృతి చెందితే ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు కేవీవీ సత్యనారాయణ, సీపీఎం కన్వీనర్ జి.అప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూములు తీసుకుంటే ఆత్మహత్యలే శరణ్యం

- గోర్స గ్రామస్తుల హెచ్చరిక
- లింకు పత్రాలు తమ వద్ద ఉండగా స్వాధీనం కుదరదంటున్న బాధితులు



భూముల వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కొత్తపల్లి: సాగు చేసుకుంటున్న భూములను దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని గోర్స సీతారామ ఆలయానికి సంబంధించి కొమరగిరి రెవెన్యూ పరిధిలో ఉన్న వివాదాస్పద భూముల వద్ద సాగు చేస్తున్న రైతులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 121, 122లో గల 19.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తే మూకమ్మడిగా రైతులు అందరూ ఆత్మహత్యలకు పాల్పతామని హెచ్చరించారు. గ్రామంలో సీతారామ స్వామి ఆలయ భూములని చెబుతున్న భూములన్నీ తమ పేరున ఉన్నాయని, ఆయా భూములు ఎవరినుంచి వచ్చాయనే లింకు పత్రాలు తమ వద్ద ఉండగా దేవదాయశాఖకు చెందిన భూములని అధికారులు హెచ్చరించడమేమిటని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ భూమి తమ స్వాధీనంలో ఉందన్నారు. దేవదాయ శాఖకు చెందిన భూములైతే ఇన్నేళ్ల నుంచి ఏం చేశారంటూ రైతులు ప్రశ్నించారు. తమ పేరుపై ఉన్న భూములను తమ పిల్లలకు కట్నకానుకలుగా ఇచ్చామని, ఇపుడు ఆ భూములను స్వాధీనం చేసుకుంటే వారి భవిష్యత్ ఏమిటని ప్రశ్నించారు.

స్వాధీనం చేసుకోకుంటే ఆమరణ నిరాహార దీక్ష

సీతారామ ఆలయం వద్ద గ్రామస్తులు, భక్తుల ఆందోళన

కొత్తపల్లి: అన్యాక్రాంతమైన దేవాలయ భూములను దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోకపోతే గ్రామస్తులు అంతా కలిసి ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధంగా ఉన్నామని సర్పంచి రొంగల వీరబాబు అన్నారు. ఈ మేరకు మండలంలోని గోర్స గ్రామంలో ఉన్న పురాతన సీతారామ ఆలయం వద్ద శనివారం వారు ఆందోళన నిర్వహించారు. కాకినాడలోని దేవదాయ శాఖ అధికారిని కలవడం జరిగిందని, సీతారామ ఆలయానికి సంబంధించిన భూములు సర్వే నెంబర్ 121, 122లో గల 19.92 ఎకరాలను శనివారం స్వాధీనం చేసుకుంటామని చెప్పారన్నారు. దీనికి సంబంధించి పోలీసులు, 108 వాహనం కూడా వచ్చాయని, కొంత సమయానికి తిరిగి వెళ్లిపోవడంలో ఆంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. దేవుడి భూమి దేవుడికి దక్కే వరకూ పోరాటం ఆగదన్నారు. వారం రోజుల్లో పరిష్కారం చూపిస్తామని దేవదాయ అధికారులు చెపుతున్నారన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



కోట్లమ్మ చెరువు వద్ద పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సామర్లకోట: స్థానిక కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న ప్రధాన పైప్‌లైన్ లీకు కావడంతో మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ఎద్దడి నెలకొంది. స్థానిక ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్ నుంచి పైపులైన్ ద్వారా కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న రెండు ట్యాంకులను నింపుతున్నారు. అయితే ఆ పైపులైన్‌కు లీకులు ఏర్పడి ట్యాంకులు నిండే అవకాశం లేకపోతోంది. దీంతో ట్యాంకుల ద్వారా నీరు సరఫరా అయ్యే ప్రాంతాలకు తాగునీటి ఎద్దడి ఏర్పడింది. ఇంజినీరింగ్ శాఖలోని ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మెలో ఉండడం వల్ల పైప్‌లైన్ మరమ్మతులకు కొంత మేర ఇబ్బంది ఏర్పడిందని ఇంజినీరింగ్ సిబ్బంది తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం నాటికి పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి చేసి తాగునీరు పూర్తి స్థాయిలో అందజేస్తామని ఫిల్టర్ బెడ్ ఇన్‌చార్జి గిడుతూరి శ్రీనివాసరావు తెలిపారు.

దేవాలయాల అభివృద్ధికి అహల్యాబాయి కృషి



రాణి అహల్యాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్

బోట్‌క్లబ్: దేశంలో ప్రసిద్ధ హిందూ దేవాలయాల అభివృద్ధికి రాణి అహల్యాబాయి ఎంతో కృషి చేశారని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. స్థానిక సూర్య కళామందిరంలో శనివారం రాణి అహల్యాబాయి 300వ జయంతి వేడుకలు జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాధవ్ మాట్లాడుతూ రాణి అహల్యాబాయి హోల్కర్ మరాఠాలు పరిపాలించిన మాల్వా సామ్రాజ్యంలో 1725 మే 24న జన్మించారన్నారు. హైందవ సంబంధ కార్యక్రమాలు నిర్వహించి పేరు ప్రఖ్యాతులు సాధించారన్నారు. రాణి అహల్యాబాయి ఇండోర్, మహేశ్వర్ ప్రాంతాల్లో అనేక హిందూ దేవాలయాలు నిర్మించారని, అనేక పవిత్ర స్థలాల్లో ధర్మశాలలు నిర్మించారన్నారు. ద్వారక మొదలుకొని వారణాసి, ఉజ్జయిని, నాసిక్, గయ, వైద్యనాథ్ ఆలయం వంటి ప్రాంతాల్లో ధర్మశాలలు నిర్మించారన్నారు. బీజేపీ నాయకులు వేటుకూరి సూర్యనారాయణరాజు, పెద్దిరెడ్డి రవికిరణ్, పైడా కృష్ణమోహన్, యార్లగడ్డ రామ్‌కుమార్, గౌతు చిన్న పాల్గొన్నారు.

శ్రీపాదునికి మధురఫల నివేదన



పిఠాపురం: స్థానిక దత్త క్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో స్వామి వారికి శనివారం మామిడిపండ్లతో నివేదించి ప్రత్యేక పూజలు చేశారు.

అడవిపుంత ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్‌కు ప్రజా సంఘాల వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు అడవి పుంత రోడ్డులోని స్థలాన్ని తాండ్ర ఫ్యాక్టరీ యాజమాన్యం ఆక్రమించడంపై ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీల నాయకులు గొల్లప్రోలు తహసీల్దారుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కుంచె అంజిబాబు మాట్లాడుతూ రైతులు నిరంతరం రాకపోకలు సాగించే అడవి పుంతరోడ్డును ఆక్రమించుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పుంతలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి, రోడ్డుపై కలప వేస్తున్నారన్నారు. మామిడి తాండ్ర నుంచి వచ్చే వ్యర్థాలను పుంతలో రోడ్డు మీద వేస్తున్నారన్నారు. దీని వల్ల ఆ పుంతలో వెళ్లే రైతులు వర్షాలు పడినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అందువల్ల తక్షణమే అడవి పుంతను సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలని సంబంధిత మామిడి తాండ్ర ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుడితి సతీష్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు డి.నారాయణమూర్తి, గుడాల చార్లెస్, బల్ల సోమరాజు తదితరులు పాల్గొన్నారు.